క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డీఎస్‌ఓ



నెల్లూరు(అర్బన్): శ్రీకాకుళం జిల్లాలో పని చేస్తూ జిల్లా నూతన డీఎస్‌ఓగా బదిలీపై వచ్చిన విజయకుమార్.. కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేను అందజేశారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు రూరల్: వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఎండ తీవ్రతకు గురికాకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రతలు, వడగాల్పులపై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారమిస్తూ గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ఆస్పత్రులు, 108 వాహనాల్లో ఐస్ ప్యాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాలు, బస్సుల్లో వాటర్ క్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో డ్వాక్రా సంఘాల ద్వారా సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని బోర్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. విద్యుత్ కోతలు, షార్ట్‌సర్క్యూట్ లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వడదెబ్బ తగలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. డీఆర్వో ఉదయభాస్కర్ రావు, జిల్లా వైద్యాధికారి సుజాత, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు సత్యవాణి, రమేష్‌నాయక్, ఆర్టీసీ ఆర్ఎం మురళీబాబు, విద్యుత్‌శాఖ ఈఈ శ్రీధర్, డ్వామా ఏపీఓ కనకదుర్గాభవాని, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాదర్ వలీ, ఐసీడీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మైపాడులో సందడి

ఇందుకూరుపేట: ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు సాగర తీరం సందర్శకులతో సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో మంగళవారం తరలివచ్చి సేదతీరారు. దీంతో మైపాడు, నెల్లూరు ప్రధాన రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా ఎస్సై నాగార్జునరెడ్డి పర్యవేక్షించారు.

క్రైస్తవ సంఘాల నిరసన

కొడవలూరు (బుచ్చిరెడ్డిపాళెం): పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీని క్రైస్తవ సంఘాలు మంగళవారం నిర్వహించాయి. పట్టణంలోని అంబేడ్కర్ భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. సమగ్ర విచారణ జరిపి.. క్రైస్తవ సమాజానికి రక్షణ కల్పించాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి.. పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తే చర్యలు

కోవూరు: చికెన్ వ్యర్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. రెండు వారాల వ్యవధిలో నాలుగు వాహనాలను సీజ్ చేసి కేసులను నమోదు చేశామన్నారు.

ఈ - కేవైసీని విధిగా చేయించుకోవాలి

కోవూరు: రేషన్‌కార్డుదారులు ఈ – కేవైసీని తప్పక చేయించుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా కోరారు. పట్టణంలోని ఈ – కేవైసీ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రేషన్ డీలర్ల అసోసియేషన్ నేత కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

పొదలకూరు: పట్టణంలోని నాయీ బ్రాహ్మణులు మంగళవారం భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లి ఆలయంలో పొంగళ్లు పెట్టారు. తమ ఇళ్ల వద్ద నుంచి పొంగలి పూజా సామగ్రి బుట్టలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పొంగళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పొదలకూరు: పట్టణంలోని గేట్ సెంటర్, ఆచారి వీధి, ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జి.పెంచల నరసయ్య, సభ్యులు సరోజనమ్మ, కిష్టయ్య, కొండయ్య, మధు, కిశోర్, పి.జాహ్నవి పాల్గొన్నారు.

గొంతెండుతోంది..

- గిలకబావి సంఘ వాసుల అవస్థ
- కావేరి అవెన్యూ, ఇందిరానగర్‌లోనూ ఇంతే
- మూడు రోజులకోసారి నీటి సరఫరా



కావేరి అవెన్యూ

నెల్లూరు(అర్బన్): నగరంలోని 20వ డివిజన్ పరిధిలో గల ఇస్కాన్ సిటీ సమీపంలో ఉన్న గిలకబావి సంఘ వాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వేసవి రాక ముందే ఈ దుస్థితి నెలకొంది. సమీపంలోని కావేరి అవెన్యూ, ఇందిరానగర్‌లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. రెండు, మూడు రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తుండటంతో ఇక్కడి వారికి వెక్కిళ్లు తప్పడంలేదు. గిలకబావి సంఘంలో దాదాపు వెయ్యి మంది నివసిస్తుండగా, వీరిలో ఎక్కువ శాతం మంది బడుగు, బలహీన, దళిత వర్గాల ప్రజలే. కూలీ పనులు చేసుకుంటూ బతుకబండిని నెట్టుకొస్తున్నారు. వంటా, వార్పు చేయాలన్నా, పిల్లలను పాఠశాలలకు సిద్ధం చేయాలన్నా నీటి సమస్య వెంటాడుతోంది.

మొరపెట్టుకున్నా.. ప్రయోజనమేదీ..?

కావేరి అవెన్యూ, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో వెయ్యి మంది నివసిస్తున్నారు. తాగునీటి సమస్యపై కార్పొరేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా, ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. కొందరు ఫిట్టర్లు తమ ఇష్టానుసారంగా అపార్ట్‌మెంట్లు ఎక్కువగా ఉండే చోట వాల్వ్ తిప్పి నీటిని సరఫరా చేస్తూ.. పేదలుండే చోట కోత విధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రిగా నారాయణ ఉన్నా, ఏమి లాభమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నీటి కోసం పడరాని పాట్లు



మా ప్రాంతంలో తాగునీటిని కార్పొరేషన్ అధికారులు సక్రమంగా సరఫరా చేయడంలేదు. మూడు రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. నీటి కోసం అపార్ట్‌మెంట్ల వద్దకెళ్తే వారు పట్టుకోనీయడంలేదు. ప్రాధేయపడి ఎంతో కొంత తెచ్చుకుంటున్నాం. నగరపాలక సంస్థ అధికారులను సంప్రదిస్తే, ఎండా కాలం.. సర్దుకోవాలని సలహా ఇస్తున్నారు.

– పెంచలమ్మ, గిలకబావి సంఘం

ఉగాది రోజునా కటకటే



నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. సక్రమంగా సరఫరా చేయడం లేదు. రెండు, మూడు రోజులకోసారి అర్ధగంటే అందజేస్తున్నారు. వచ్చినా సన్నటి ధారలానే ఉంటోంది. ఉగాది పండగ రోజునా ఇదే పరిస్థితి. లోపాలను సరిచేసి తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలి.

– రూతమ్మ, కావేరి అవెన్యూ

రజకుల సమస్యలు పరిష్కరించాలి



రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని రజకుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య డిమాండ్ చేశారు. జేమ్స్‌గార్డెన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏపీ రజక వృత్తిదారుల సంఘ ఆధ్వర్యంలో నేరేళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడారు. రజకుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలను కొండపల్లిలో ఈ నెల 20, 21న నిర్వహించనున్నామని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో వివిధ హామీలను టీడీపీ గుప్పించిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్నా, నేటికీ దేన్నీ అమలు చేయలేదని విమర్శించారు. నేతలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, దేవరకొండ వెంకటేశ్వర్లు, సాయి, పాట్టీపాళెం సుధాకర్, సురభి శ్రీనివాసులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీజిల్‌ను తాగేస్తున్నారు..!



- దొంగచాటుగా తీసి.. గోల్‌మాల్
- బయట విక్రయించి సొమ్ము చేసుకుంటూ..
- లెక్కల పరిశీలనలో 30 లీటర్ల తేడా
- నగరపాలక సంస్థలో ఇదీ తీరు..

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో డీజిల్‌ను కొందరు అక్రమార్కులు తాగేస్తున్నారు. వాహనాల నుంచి దొంగచాటుగా తీసి బయట విక్రయించి భారీగా ఆర్జిస్తున్నారు. ఫలితంగా వినియోగమయ్యే దానికంటే అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

జరగాల్సింది ఇలా..

నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించిన చెత్త తరలించే వాహనాలు, ఫాగింగ్ యంత్రాలు, కొందరు అధికారుల కార్లకు అవసరమైన డీజిల్‌ను వినియోగిస్తారు. ఇక్కడి వెహికల్ షెడ్‌లోనే డీజిల్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనాల్లో నింపి, ఏ రోజు లెక్కలను అదే రోజు పరిశీలిస్తారు.

నిత్యం 1100 లీటర్ల వినియోగం

మొత్తం 140 వాహనాలకు గానూ 1100 లీటర్ల డీజిల్‌ను నిత్యం వినియోగిస్తారు. చెత్తను తరలించే వాహనాల నుంచి డంపింగ్ పూర్తయ్యాక వీటిని ఆయా ప్రదేశాల్లో ఉంచుతారు. ఆ సమయంలోనే సంబంధిత వాహనాల డ్రైవర్లు కొంత మేర డీజిల్‌ను బయటకు తీసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా పలు వాహనాల నుంచి తీసిన డీజిల్‌ను క్యాన్‌లో నింపి, బయట విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అంతా ఇష్టారాజ్యమవుతోంది. మరోవైపు మార్చిలో ఎంత డీజిల్ వినియోగమైందనే లెక్కలను సంబంధిత అధికారులు మంగళవారం పరిశీలించగా, 30 లీటర్ల తేడాను గుర్తించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

వారం రోజులకు సరిపడా..

క్లాప్ చెత్త వాహనాలకు మాత్రం వారం రోజులకు సరిపడా డీజిల్‌ను నింపుతారు. ఈ వాహనాలు 25 కిలోమీటర్లలోపే నిత్యం తిరుగుతాయి. కొన్ని సందర్భాల్లో ఇంతకంటే తక్కువా తిరిగే అవకాశమూ ఉంది. ఇలాంటి సమయాల్లో ఒకట్రెండు లీటర్ల డీజిల్‌ను బయటకు తీస్తుంటారు. కొన్ని వాహనాలకు లెక్కకు మించి డీజిల్ వినియోగమైందనే అంశాన్ని అధికారులు గుర్తించారు. ఈ విషయమై వెహికల్ షెడ్‌లోని డీజిల్ ట్యాంక్ వద్ద ఉంటున్న వ్యక్తిని నిలదీయగా, అసలు విషయం చెప్పారు. నగరపాలక సంస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగికి 30 లీటర్లను ఇచ్చానని తెలిపారు.

అయితే సదరు అధికారి ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో సీరియస్ అయ్యారని సమాచారం. కాగా ఈ విషయమై వెహికల్ షెడ్ నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఏఈ అంజిరెడ్డిని ఫోన్లో సంప్రదించగా, డీజిల్ వినియోగంలో ఎలాంటి తేడాను గుర్తించలేదని చెప్పారు. వినియోగానికి సంబంధించిన రీడింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, డీజిల్‌ను చోరీ చేసి విక్రయించారని తెలిస్తే తగు చర్యలు చేపడతామని చెప్పారు. అయితే అలాంటిదేమీ జరగలేదని బదులిచ్చారు. కమిషనర్ సీరియస్ అయిన ఉదంతం వేరే విషయమని ఆయన చెప్పారు.

పాస్టర్ మృతిపై విచారణకు డిమాండ్



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న క్రైస్తవులు

నెల్లూరు(అర్బన్): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం హనోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నాను పలువురు క్రైస్తవులు మంగళవారం చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

అసోసియేషన్ నేతలు రమేష్, జాషువా, ఎనోష్, సునీల్ గవాస్కర్, శ్యామ్, క్రాంతికుమార్, జోనా, భాస్కర్, అరుణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో నిందితుడిపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. ఖుద్దూస్‌నగర్‌లో నివాసం ఉంటున్న సిరాజ్‌కు పక్క వీధిలో ఉండే నిహాల్‌తో ఫోన్ విషయమై మనస్పర్థలున్నాయి. ఈ నేపథ్యంలో షాదీ మంజిల్ సమీపంలోని ఓ టీ దుకాణం వద్ద సిరాజ్ సోమవారం రాత్రి ఉండగా, దాడి చేసి నిహాల్ గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్ల ఎంపికలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): టెన్నిస్‌బాల్ క్రికెట్ అండర్ – 19 బాలబాలికల జిల్లా జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్ – 19 పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. వివరాలకు 94935 82143, 91829 10893 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పన్నుల వసూళ్లు భేష్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో పన్నుల వసూళ్లలో విశేష కృషి చేసిన అధికారులు, సిబ్బంది సేవలను కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.77,76,09,759 మేర వసూలు చేశారని వెల్లడించారు. ఒక్క సోమవారమే రూ.2.85 కోట్లను వసూలు చేశారన్నారు. గతేడాదితో పోలిస్తే ఇది రూ.11.38 కోట్లు అదనమని తెలిపారు.

రెజ్లింగ్ జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రెజ్లింగ్ జిల్లా జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 20 ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైన క్రీడాకారులు.. రాజమహేంద్రవరంలో ఈ నెల ఐదున నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. వివరాలకు 94416 44761 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు జరపాలి



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు గానూ స్కానింగ్ కేంద్రాలపై సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలను చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. పీసీ, పీఎన్డీటీ చట్టం అమలుపై కలెక్టరేట్లోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అబార్షన్లు నిర్వహించకుండా గర్భస్థ శిశువులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులతో పాటు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 ఆకస్మిక తనిఖీలను నిర్వహించామని డీఎంహెచ్‌ఓ సుజాత తెలియజేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు, డెమో అధికారి కనకరత్నం, ఎన్జీఓ కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (టౌన్): మాగుంట లేఅవుట్లోని ఓ కల్యాణ మండపంలో కృష్ణచైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడారు. సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. వీసీ ఆధ్వర్యంలో వర్సిటీ మరింత ఉన్నతంగా వెలుగొందాలని కాంక్షించారు. అనంతరం పీజీ ఫలితాల్లో వర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్లను అందజేశారు. వీసీని సత్కరించారు. కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణాప్రమోద్ రెడ్డి, డీన్ జ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయ ఎదుట నిరసన



నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయ ఎదుట నిరసనను మంగళవారం చేపట్టిన అనంతరం వారు మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లకు అప్పగిస్తే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. 60 ఏళ్లు నిండాయనే నెపంతో నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 93 మంది ఆప్కాస్ ఉద్యోగులను హఠాత్తుగా నిలిపేయడం దారుణమని చెప్పారు. సమస్యలపై నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చెన్నుడికి వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నేత పెంచలనరసయ్య, నగర కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు అధ్వానం



మాట్లాడుతున్న మురళీకృష్ణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖల అధికారుల పనితీరు అధ్వానంగా మారిందని అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు, బీసీ విద్యార్థి యువజన సంఘ రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ ఆరోపించారు. నగరంలోని అంబేడ్కర్ భవనలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల హాజరును వార్డెన్లు రెండేళ్లుగా తప్పుగా వేస్తూ, ప్రభుత్వ నిధులను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. నేతలు నాయబ్ రసూల్, మహేష్‌గౌడ్, రాము, నరేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల చెక్కు అందజేత



నెల్లూరు (టౌన్): పేద పిల్లల చదువు నిమిత్తం రూ.20 వేల చెక్కును జెండావీధికి చెందిన మునీర్ అందజేశారు. విద్యోదయ పాఠశాల ప్రిన్సిపల్ పద్మజకు ఈ మొత్తాన్ని అక్షయ ఫౌండేషన్ అధ్యక్షుడు అనుమకొండ నరేంద్రనాథ్, కార్యదర్శి చెరువుల నరేంద్రబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఇచ్చారు. ఫౌండేషన్ కోశాధికారి మునివెంకటసతీష్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా



నెల్లూరు(అర్బన్): సైదాపురం మండలంలోని ఊటుకూరులో దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేసి.. భూములకు యాజమాన్య హక్కులను కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా కమిటీ అధ్యక్షుడు పోలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నాను పలువురు దళితులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే నంబర్లు 359, 356లోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సర్వే చేయించాలని కోరారు. పెత్తందారులు, బడా భూస్వాముల చెరలో ఉన్న ప్రభుత్వ, మిగులు, పోరంబోకు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంచాలని కోరారు. భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్న దళితులపై అక్రమ కేసులు, పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రగతిశీల మహిళా సంఘ నేతలు మమత, అనూష, నాగమణి, రైతు కూలీ సంఘ నేతలు హరిబాబు, పెంచలయ్య, కోటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



రామలక్ష్మమ్మ (ఫైల్)



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సునీల్

నెల్లూరు(అర్బన్): కావలిలోని కొత్తబజార్‌కు చెందిన సుబ్బారావు (80) మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో అభయం సేవా సంస్థ అధినేత శ్రీవాణి, వాసవీ వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత సహకారంతో ఆయన నేత్రాలను జిల్లా ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యుడు వెంకటేశ్వరరావు దానం చేశారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు.

- బీవీనగర్‌లోని షార్ కాలనీలో నివాసం ఉంటున్న మోపూరు రామలక్ష్మమ్మ (95) మృతి చెందారు. ఈ క్రమంలో చిరంజీవి ఐ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ సహకారంతో ఆమె నేత్రాలను పెద్దాస్పత్రికి కుటుంబసభ్యుడు మోపూరు పెంచలయ్య దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించి, సర్టిఫికెట్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 98666 16565 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నారాయణ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆర్టీసీ జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్, డీఎంలు మురళీకృష్ణ, శివకేశవ్‌యాదవ్ పాల్గొన్నారు.